# ప్రామిస్

రూపాయలు అడిగా! నా లోన్ అందగానే యిచ్చేస్తానన్నా తప్పు కుండా యిస్తానని ప్రామిస్ చేసాడు. ఉదయం యింటికి వచ్చి తీసుకొని వెళ్ళమన్నాడు! రేపు కొంటా! నీ పుట్టిన రోజుకి చీర కొంటానని ప్రామిస్ చేసాకదా తప్పకుండా కొంటా!

లాలనగా చూసి అనునయించాడు రామారావు ఇవ్వగానే చీర కొని తన మాట నిలబెట్టుకోగలనన్న ధీమాతో..

లలిత మరేమీ మాట్లాడలేక పోయింది.

ఉదయం ఎనిమిది గంటలయే సరికల్లా మంచి శకునం చూసుకొని రామారావు యింటికి బయలు దేరాడు అప్పుకోసం. రామారావుది స్వంత యిల్లే. కొంచెం వున్నవాడు కూడాను. వీధి గుమ్మంలో రామారావు పిల్లలు యిద్దరు ఆడుకొంటున్నారు.

"రామారావుగారున్నారా?"

"నాన్నగారాండి? వున్నారు!" అంటూ లోనికి తుర్రుమన్నాడు పెద్దబ్బాయి. వాడి వెనుకనే చన్నవాడు కూడా లోనికిపోయాడు. మరునిమిషంలోనే పిల్లలిద్దరూబయటకువచ్చి "కూర్చోండిసార్! నాన్న గారు బాత్‌రూంలో వున్నారు!" పెద్దబ్బాయి చెప్పి ఆటలో పడ్డాడు. వరండాలో రెండు గాడ్రెజ్ కుర్చీలున్నాయి. ఓ కూర్చీలో కూర్చుని వీధిలో వచ్చే పోయే జనాన్ని చూస్తున్నాడు. పిల్లలు హుషారుగా ఆడుకొంటున్నారు. అంతలో ఓ గంగిరెద్దువాడు హడావుడి చేసుకొంటూ వచ్చాడు. వాకిట్లో ఎద్దుని నిలబెట్టాడు.

అలవాటు ప్రకారం పిల్లలిద్దరూ యేకకంఠంతో అన్నారు, "అమ్మగారు పూజలో వున్నారు! మరో యింటికి వెళ్ళు!".

వారి మాటల్ని వాడు వినిపించుకోలేదు. సన్నాయి వూదటం ప్రారంభించాడు. పిల్లలకి ఒకే సరదగా వుంది. వాళ్ళ ఆసక్తినీ, ఉత్సాహాన్నీ ఆసరాగా తీసుకొని సన్నాయి స్వరం హెచ్చించాడు గంగిరెద్దువాడు.

"వెళ్ళమంటే నీక్కాదూ?" గట్టిగా అన్నాడు ఆనందాన్ని అణచుకోడానికి ప్రయత్నిస్తూ పెద్ద అబ్బాయి.

వాడు సన్నాయి ఆపుచేసి, "ఎద్దును ఆడిస్తా! బియ్యం వెయ్యండి!" అన్నాడు.

పిల్లల్లో వుత్సాహం ఎక్కువయింది. ఒకరి మొహం ఒకళ్ళు చూసుకొని కళ్ళతోనే కూడబలుక్కున్నారు. ఇంటిలోనికి పోయి గ్లాసుతో బియ్యం తెచ్చి వాడి సంచీలో పోసారు. ఆశగా ఎద్దు వైపు చూసారు. ఎద్దుపైనున్న రంగు రంగుల గళ్ళ గళ్ళ చీరలనూ గంటలనూ చూస్తున్నారు. గంగిరెద్దువాడు సంచీలోకి చూసుకొన్నాడు ఏపాటి బియ్యం పోగయ్యాయో అని. ఎద్దును అదలించాడు ప్రక్కింటికిపోయే ప్రయత్నంలో. వాడు ఒక్కడుగు వేయగానే, "ఏయ్! ఆగు!" దబాయించాడు పెద్దబ్బాయి.

వాడు వెనక్కి తిరిగి చూసాడు నిర్లక్ష్యంగా.

"బియ్యం వేస్తే ఆడిస్తానన్నావ్?" హుంకరించాడు.

వాడేమీ జడవలేదు.

"ఇది కొత్త యెద్దు బాబూ! ఆట నేర్పలేదు!" అనేసి ముందుకు పోయాడు. వాడిని అనుసరించింది యెద్దు. పిల్లలు యేడుపు మోహంతో యింట్లోకి పోయారు కాళీగ్లాసుతో.

"ఎంత మోసం!" అను కొన్నాడు భాస్కరం తనలో తానే.

"ఓ! భాస్కరంగారా! రండి రండి! బయటనే కూర్చున్నారే!" వరండాలోనికి వస్తూ పలకరించాడు రామారావు ఆప్యాయంగా. భాస్కరం రామారావుని అనుసరించాడు. తిన్నగా తన డ్రాయింగ్ రూంలోకి తీసుకొనిపోయాడు. ఆ గదిని పరిశీలనగా చూసాడు. అందమైన, ఖరీదైన చిత్రపటాలు చాలా అందంగా వుంది.

"ఎంతసేపయింది వచ్చి? వెరీ సారీ! నాకిప్పుడే తెల్సింది మీ రొచ్చినట్లు!"

నొచ్చుకొన్నాడు. భాస్కరానికి ఓ కుర్చీ చూపించి తానొక కుర్చీలో కూర్చున్నాడు.

"ఓరేయ్! నానాజీ రెండు బోర్న్ విటా పట్రా!" కే కేసాడు.

"అబ్బే, అక్కర్లేదండీ! ఇప్పుడే కాఫీ తాగి బయలుదేరా!" మొహమాటంగా అన్నాడు సభ్యతకోసం. అతని మాటల్ని వినిపించుకోలేదు రామారావు.

"మన మానేజరుకి ఆఫీసర్ ప్రొమోషన్ వచ్చిందిట!" మాటల్లోకి దింపాడు రామారావు.

"అవునండి! నిన్న స్టెనో అంటే విన్నా!" అన్నాడు చేతి వాచి చూసుకొంటూ. టైము ఎనిమిదీ నలభై అయింది. డబ్బు తీసుకొని బజారు కెళ్ళాలి. చీర కొని యింటికి వెళ్ళి భోజనం చేసి ఆఫీసుకెళ్ళాలి పదిగంటలకల్లా.

నానాజీ బోర్న్‌విటా తెచ్చి అందించాడు. భాస్కరానికి ఓ కప్పు అందించి తానొక కప్పు తీసుకొన్నాడు. అతని ఆదరణకి ఆశ్చర్యపోయాడు భాస్కరం. అసలు విషయంలోకి దించాలనుకొన్నాడు. అతనే యిస్తాడులే అనుకొన్నాడు మొహమాటపడి.

ఖాళీకప్పు కింద పెడుతూ అతనివైపు చూడకుండా "అప్పుడే తొమ్మిదయింది! బజారులో పని చూసుకొని భోజనం చేసి ఆఫీసుకు రావాలి!" అనేసాడు.

"మన బాస్ లేడుగా!" నవ్వుతూ అన్నాడు రామారావు.

బలవంతాన నవ్వు మొహం తెచ్చుకొన్నాడు. డ్రాయరు సొరుగు లాగాడు రామారావు. ఆశగా చూసాడు భాస్కరం పర్స్ తీస్తాడేమో అని. సిగరెట్టు పెట్టి అగ్గి పెట్టె తీసాడు. సిగరెట్టు తానొకటి తీసుకొని, భాస్కరానికి ఒకటి అందించాడు. నిరుత్సాహంగానే అందుకొన్నాడు భాస్కరం.

రామారావు పొగను రింగులు రింగులుగా వదుల్తూ పైకి చూసాడు.

ఏవిటీ! డబ్బు తీయడు! మర్చిపోయాడా? అవసరం మనది. మరలా అడిగినా పరవాలేదు. అయినా యిస్తానని ప్రామిస్ చేసాడుగా అనుకొన్నాడు. అయినా ధైర్యంచేసి డైరెక్టుగా అడగలేక పోయాడు.

"టైమవుతోంది!" అన్నాడు మరోసారి మరోసారి వాచీ చూసుకొంటూ.

ఉలిక్కి పడినట్లుగా అన్నాడు రామారావు.

"అవునవును! తొమ్మిదింబావయింది! అయాం వెరీసారీ మిష్టర్ భాస్కర్రావ్! నిన్న సాయంత్రం మాపెద్ద బావమరిది కలకత్తా నుంచి వచ్చాడు. ఏదో అర్జంటు పనుందని మూడు వేలు పట్టుకెళ్ళాడు. ఈ సంగతి రాత్రి యింటికి వచ్చే వరకూ నాకు తెలియదు! పది రోజుల్లో తిరిగి వచ్చేస్తానన్నాట్ట! నా మిసెస్ చెప్పింది, అప్పటికి మీ లోనూ కేష్ అయిపోతుందనుకొంటా, ఎక్స్యూజ్‌మీ!"

చావుకబురు చల్లగా చెప్పాడు. కొయ్యబారిపోయాడు భాస్కరం. నోట మాట రాలేదు. అతని పరిస్థితి చూసి మరలా రామారావే అన్నాడు.

"ఈ సంగతి నాకు ముందుగా తెలిస్తే మీకు ప్రామిస్ యిచ్చేవాణ్ణి కాదు?"

"మీరిస్తారు కదా అని వేరే ప్రయత్నం చేయలేదు!" అనేసి లేచి నిలబడ్డాడు భాస్కరం.

"ఒరే రాముడూ!" ఆఫీసుకి వేళవుతోంది! భోజనం వడ్డించమంటావా?" లోపలి నుంచి అతని తల్లి కేకవేసింది.

రామారావు కూడా లేచాడు.

"ఇంటికి వచ్చేవరకు నాకు తెలీదూ! క్షమించాలి!"

మరోసారి క్షమాపణ కోరాడు రామారావు.

భాస్కరం మాట్లాడలేకపోయాడు.

"వస్తాను సార్" అంటూ బయలుదేరాడు.

"అమ్మా, పెద్ద మావయ్య కలకత్తా నుంచి వస్తున్నాడు!" వీధి గుమ్మంలో ఆడుకొంటూన్న పిల్లలు వుత్సాహంతో వురకలు వేస్తూ లోనికి వస్తున్నారు.

ఓ పెద్దమనిషి గుమ్మం ఎక్కుతున్నాడు పెట్టే బెడ్డింగూ వగైరాలతో

" పెద్ద బావమరిది అంటే ఇతనే కాబోలు!" అనుకొంటూ అతనికి లోనికి పోవడానికి దారిస్తూ బయట పడ్డాడు భాస్కరం.

❖ ❖ ❖ ❖ ❖

"అమ్మగారూ! పనయిపోనాది! సూసుకోండి, కొత్తాటిలా ధగధగా మెర్సిపోతున్నాయ్!"

పెరటి గుమ్మంలో గిన్నెలు పేరుస్తూ కేకవేసింది పనిమనిషి రత్తాలు.

"ఉండవే! వస్తున్నా! అయ్యగారు ఆఫీసుకెళ్తున్నారు!"

గదిలోంచే జవాబిచ్చింది లలిత.

"మరేమీ బాధపడకండి ఎక్కడా అప్పు చేయకండి! డబ్బు వచ్చినప్పుడే కొనుక్కోవచ్చు!"

భర్తను ఆఫీసుకు సాగనంపుతూ అంది. వీధి గుమ్మంలో నిలబడి భర్తవైపే చూస్తూ నిలబడ్డ లలితకి రత్తాలు కేక మరోసారి వినిపించింది.

"ఇయ్యేల బలే యిదిగా మెర్సిపోతున్నాయమ్మగారూ గిన్నెలు, వంటిల్లు కడిగేసా! పొయ్యి అలికేసా! బట్టలుతికి ఆరేసా! నీళ్ళు తోడేసి!"

ఏ పనీ వదల్లేదనీ, అన్ని పనులు సవ్యంగా చేసేసానని తెలియజేసింది. ప్రతి రోజూ ఏదో ఒక పని వదిలేసి పోవడం దానికి అలవాటు.

"ఏవిటే అంత వుత్సాహంగా వున్నావ్ ఈ వేళ?"

రెచ్చగొడుతూ అడిగింది లలిత.

"ఏవీ లేదమ్మగారు! యియ్యేల మా మావ మేట్నీ సినీమాకి తీసుకెల్తానన్నాడు! 'మా యమ్మగారి పుట్టిన్రోజూ, నేను రానూ' అన్నా! అయినా ఒప్పుకోలేదుమ్మగారూ! ఆడు అసలే తిక్క మడిసి! ఆడికి మనసయినప్పుడే ఎల్లాల!" సిగ్గుతో వంకలు తిరిగిపోయింది రత్తాలు.

లలితకి నవ్వొచ్చింది.

"సరే వెళ్లవే!" అంది ఆప్యాయంగా

రత్తాలు కదల్లేదు. లలిత గిన్నెలు తీసి యింట్లో సర్దుకొంది. రత్తాలు అలాగే నిలబడి వుండి పోవడంతో ఆశ్చర్యపోయింది.

"ఏవే యింకా వున్నావ్?"

"అదేనమ్మ గారూ! ఇయ్యేల తవరి పుట్టిన్రోజు! తల గోక్కుంటూ ఆశగా చూసింది.

"సరే ఈ రూపాయి తీసుకెళ్ళి పూలు కొనుక్కో!"

ఓ రూపాయి రత్తాలు చేతిలో పడేసింది.

అయినా కదల్లేదు రత్తాలు.

"ఏవిటే? ఏంకావాలో చెప్పు"

రత్తాలు ధోరణి అవగాహన కాలేదు లలితకి.

"అదేనండమ్మ గారూ! తవరి పుట్టిన్రోజూ...." అంటూ ఆగిపోయింది నీళ్ళు నములతూ.

"ఏమయినా చేసుకొంటే పెడతా. సినీమా అయ్యాక సాయంత్రం ఓ సారి రా! అంది. ఆమెను వదుల్చుకోడానికి ప్రయత్నిస్తూ.

"అది కాదమ్మగారూ... పుట్టిన్రోజునాడు అయ్యగారు నిరుడు దీపావళిక్కొన్న నిప్పులాంటి మనిషి సీర నాకిత్తానన్నారు..." నాన్చుతూ అడగాల్సింది అడిగేసింది రత్తాలు.

అప్పటికిగాని లలితకి తాను యిచ్చిన ప్రామిస్ జ్ఞాపకానికి రాలేదు. ఆ శారీ యిస్తానని తానిదివరో రెండుసార్లంది నిజమే! వాగ్దానాన్ని నిలుపుకోలేని వాళ్ళు ఎంతమంది లేరు. మంత్రులదగ్గర నుండి మామూలు మనిషి వరకు ఎందరో వాగ్దానాలు చేస్తారు. అందరూ యిచ్చిన ప్రామిస్‌లు నిలబెట్టుకుంటున్నారా!

ఆడిట్ అబ్జక్షన్లదీ క్లియర్ చేస్తే నిమిషాలమీద పీయఫ్ లోన్ శాంక్షన్ చేస్తానన్నాడు ఆఫీసరు. బియ్యం వేస్తే ఎద్దునాడిస్తానన్నాడు గంగిరెద్దువాడు!

మర్నాడుదయం వస్తే వంద రూపాయలు అప్పు యిస్తానన్నాడు రామారావు!! భర్త చెప్పిన విషయాలు గుర్తుకొచ్చాయి.

పుట్టిన రోజునాడు తానా చీర యిస్తానని ప్రామిస్ చేసింది, నిజమే!

"ఆ చీర యిప్పుడులేదే, చాకలికి పడింది! మరోసారి చూద్దాంలే" అనేసింది అప్రయత్నంగా.

డీలా అయిపోయింది రత్తాలు తలదించుకొని మౌనంగా వుండిపోయింది.

"సినిమాకి సీరలేదమ్మ గారూ! ఆ చింకి చీరతో పూలెట్టుకొని మావతో ఎలా సినిమాకెల్టం? ఆదు అసలే తిక్కోడు. రావద్దు పొమ్మంటాడు!" కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అంది.

జాలిపడ్డ లలిత మనసు చివుక్కుమంది.

"వుండవే చూస్తా! నిన్న తెచ్చిన బట్టల్లో గాని వుందేమో!" అంటూ లోనికి పోయింది.

రత్తాలు ఆశ చిగురెత్తింది.

లలిత చీర తెచ్చి రత్తాలు చేతుల్లో పడేసింది.

రత్తాలు కళ్ళు కృతజ్ఞతతో మెరిసిపోయాయి.

"అమ్మగారు నికార్సయిన మడిసి! అన్నమాట నిలబెట్టుకొన్నారు!" కాంప్లిమెంట్స్ పారేసి వెళ్ళిపోయింది రత్తాలు.

ఏ చీరలతోనూ, నగలతోనూ పొందలేనంత ఆనందం పొందింది లలిత.

**విజయ**

**జూలై 1976**